స్ట్రామ్‌వాటర్ లేన్ పనులు షురూ

కుషాయిగూడ: కుషాయిగూడ వార్డు కార్యాలయం వీధిలో సోమవారం స్ట్రామ్‌వాటర్ లేన్ పనులు ప్రారంభమయ్యాయి. వరదనీరు సాఫీగా వెళ్లడానికి సరైన వ్యవస్థ లేకపోవడంతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేయించారు. ఎట్టకేలకు పనులు ప్రారంభం కావడంతో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ నేత నేమూరి మహేష్ గౌడ్, సీసీఎస్ ప్రతినిధి ఎంపల్లి పద్మారెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణిగౌడ్, యాదయ్య, చల్లా వెంకటేశ్, జనార్ధన్, కిశోర్, సాయికిరణ్, పిట్ల రాజు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

ఉప్పల్: ఒనపాకల గ్రూప్ అధినేత సాకేత్ తన పుట్టినరోజును పురస్కరించుకుని ఉప్పల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు కావాల్సిన నిత్యావసరాలను ఉప్పల్ ఎస్సై చిరంజీవి సమక్షంలో అందజేశారు. పాఠశాలకు నోటీస్ బోర్డు, వైట్ బోర్డు, త్రిసీటర్ చైర్, రీఫ్రిజిరేటర్, వాటర్ క్యాన్స్, స్కూల్ స్టేషనరీ, వాలీబాల్స్‌ను సైతం అందజేశారు.

సూర్యానగర్ సంక్షేమానికి సహకారం

మౌలాలి: సూర్యానగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు వినాయకనగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం అధికారులతో కలసి కాలనీలో పర్యటించిన ఆమె మాట్లాడారు. ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నాలాలకు మరమ్మతులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఈఈలు లక్ష్మణ్, మాధవీలత, డీఈలు సందీప్, లౌఖ్య, ఏఈ నవీన్ పాల్గొన్నారు.

పేదల కల సాకారం చేస్తాం

బోడుప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కలను సాకారం చేస్తోందని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని 18వ డివిజన్‌లో నిర్మితమైన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశానికి మాజీ మేయర్ అజయ్‌యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మిగతా ఇందిరమ్మ ఇళ్లను త్వరతిగతిన పూర్తి చేసి ప్రజలకు అప్పగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, కిశోర్‌గౌడ్, హేమలతారెడ్డి, సుమన్ నాయక్, నర్సింహ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడకు చెందిన వెంకటరమణకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.60వేల చెక్కు మంజూరయ్యింది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు సోమవారం కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనను జయప్రదం చేయాలి

మల్లాపూర్: వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లో నిర్వహించే పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనను జయప్రదం చేయాలని సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం నాచారంలో పాలస్తీనా సంఘీభావ కరపత్రాలను నాచారంలో పంచి పెట్టారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ.. తక్షణమే డోనాల్డ్ ట్రంప్ పాలస్తీనాపై యుద్ధం ఆపాలని డిమాండ్ చేశారు. తీవ్రంగా నష్టపోయిన పాలస్తీనాలోని గాజా ప్రజలను ప్రపంచ దేశాలు ఆదుకోవాలని కోరారు. వీఎస్‌టీ నుంచి ఇందిరా పార్క్ వరకు ప్రదర్శనలో పెద్ద సంఖ్యంలో పాల్గొని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఉప్పల్ మండల నాయకులు వి.రాజ్ కుమార్, శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా ఏఐవైఎఫ్ నాయకులు శేఖర్, నరసింహ పాల్గొన్నారు.

సాయి సమాజ్ ట్రస్ట్ సభ్యులకు సత్కారం

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ సాయినగర్‌కు చెందిన సాయిబాబా ఆలయ సాయి సమాజ్ ట్రస్ట్ సభ్యులను మల్కాజిగిరి బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ తరపున జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు ప్రతిరోజు ప్రార్థన చేయడానికి మైక్ సెట్ లేకపోవడంతో సాయి సమాజ్ ట్రస్ట్ తరపున పాఠశాలకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కృతజ్ఞత భావంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ట్రస్ట్ సభ్యులను ఘనంగా అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ చింతల మల్లేష్‌గౌడ్, కార్యదర్శి నర్సింహ, సెక్రటరీ హన్మంతరావు, సునీల్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయించండి

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి సోమవారం జలమండలి జీఎం సునీల్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. కొన్ని కాలనీలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనులను పూర్తి చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, ప్రేమ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.



కే నాష్టా..!

ఇప్పుడు ఇందిరమ్మ క్యాంటీన్లలో టిఫిన్లు

రామంతాపూర్: ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో రూ. 5కే పేదలకు భోజనం అందించే అన్నపూర్ణ క్యాంటీన్‌ల పేర్లు మార్చి ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఈ ఇందిరమ్మ క్యాంటీన్లలో రూ. 5కే భోజనంతో పాటు అల్పాహారం (టిఫిన్లు) కూడా ప్రజలకు అందజేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో 373 అన్నపూర్ణ క్యాంటీన్లు ఉండగా వాటిలో 53 సౌకర్యాలు లేక మూతపడ్డాయని ప్రస్తుతం పని చేస్తున్న 320 క్యాంటీన్ల ద్వారా ప్రతిరోజు 40 వేల మందికి రూ.5కే భోజనం వడ్డిస్తున్నట్లు సమాచారం.

- అన్నపూర్ణ క్యాంటీన్ల పేరును ఇందిరమ్మ క్యాంటీన్‌గా మార్చి రూ.5 లక్కి మిల్లెట్ ఇడ్లీ, పూరి, ఉప్మా, టమాటో బాత్ వంటి టిఫిన్లు రోజుకో స్పెషల్‌గా అందజేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఈ క్యాంటీన్లను గ్రేటర్ హైదరాబాద్‌లో దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు ఇటీవల ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రారంభించారు.

- మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా, పూరి, ఇడ్లీ టమోటా బాత్ మెనూ రెడీ
- రోజుకు స్పెషల్ ఐదు రకాల టిఫిన్లు
- అన్ని సౌకర్యాలతో నూతన కంటైనర్ల ఏర్పాటు
- ఉప్పల్ సర్కిల్‌లో రెండు చోట్ల ఏర్పాటు

- హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా తయారువుతున్న ఒక్కొక్క టిఫిన్‌కు రూ.19 ఖర్చు కాగా అందులో జీహెచ్ఎంసీ రూ. 4 భరిస్తుండగా మిగతా రూ.5ను టిఫిన్ తినే ప్రజలు భరిస్తారు.
- ఉప్పల్ సర్కిల్‌లో రెండు కేంద్రాల్లోనే టిఫిన్

ఉప్పల్ సర్కిల్ పరిధిలో రూ. 5కే భోజనం అందించే క్యాంటీన్లు ఉప్పల్ రింగ్ రోడ్డు, చిలుకానగర్, రామంతాపూర్‌లోని దూరదర్శన్ కేంద్రం రామంతాపూర్‌లోని డీమార్ట్ పక్కన ప్రధాన రహదారుల్లో మొత్తం నాలుగు కేంద్రాలు ఉన్నాయి. అయితే వీటిలో కేవలం ఉప్పల్ రింగ్ రోడ్డు, రామంతాపూర్ దూరదర్శన్ కేంద్రం వద్ద ఉన్న క్యాంటీన్లలోనే మాత్రం అల్పాహారం (టిఫిన్లు) అందించడానికి కొత్త కంటైనర్లు ఏర్పాటు చేశారు.

- రామంతాపూర్ డీమార్ట్ పక్కన చిలుకానగర్‌లో ఉన్న రెండు భోజన కేంద్రాలు, భవన నిర్మాణ కార్మికుల లేబర్ అడ్డాలు ఉన్నాయని ఈ అడ్డాలో చాలా మంది కూలీలు పనుల కోసం ఎదురు చూస్తూ గంటల తరబడి ఉంటారని కాబట్టి ఈ రెండు అడ్డల్లో కూడా కేవలం ఐదు రూపాయల భోజనం కాకుండా టిఫిన్లు కూడా వడ్డించాలని స్థానిక అడ్డా కార్మికులు, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.
- ఉప్పల్‌సర్కిల్‌లో ఈనెల చివరి వారంలో అన్నపూర్ణ క్యాంటీన్లుగా ఉన్న వాటి పేరు మార్చి ఇందిరమ్మ క్యాంటీన్లుగా ప్రారంభిస్తారని సమాచారం. కొత్తగా ఏర్పాటు చేసిన కంటైనర్లలో లోపల కూర్చుని టిఫిన్లు కాని భోజనం కాని చేసే విధంగా తయారు చేశారు. అదే విధంగా పరిశుభ్రమైన వాతావరణంలో తాగునీరుకు వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు.



ఉప్పల్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్ కంటైనర్





ఇందిరమ్మ క్యాంటీన్లలో అందజేసే మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా దృశ్యాలు

లేబర్ అడ్డాల్లో కూడా ప్రారంభించాలి



రామంతాపూర్‌తో పాటు చిలుకానగర్ లేబర్ అడ్డాలో ఉన్న ఇందిరమ్మ క్యాంటీన్లలో కూడా అల్పాహారం సౌకర్యం కల్పించాలి. రెక్కాడితే కాని కడుపు నిండని భవన నిర్మాణ కార్మికులు చాలా మంది పని కోసం ఈ అడ్డాల్లో ఎదురు చూస్తుంటారు. ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు పట్టించుకుని ఈ రెండు ప్రాంతాల్లో కూడా టిఫిన్లు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలి.
– జి.వెంకన్న, ఉప్పల్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి

సద్వినియోగం చేసుకోవాలి..



హోటల్‌లలో ఏ టిఫిన్ అయినా 40 నుంచి 60 రూపాయలకు తక్కువ లేదు. కాని ఇందిరమ్మ క్యాంటీన్లలో కేవలం రూ. 5లకు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆరోగ్యాన్నిచ్చే టిఫిన్లు అందించే ఇందిరమ్మ క్యాంటీన్లను పేద ప్రజలు, సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆహారం పొంది లబ్ధి పొందాలి. చిరు ధాన్యాలతో అందించే ఇడ్లీ, ఉప్మా టిఫిన్లతో ఆరోగ్యం సిద్ధిస్తుంది. – గాయత్రిగౌడ్, ఇందిరమ్మ కమిటీ మెంబర్, రామంతాపూర్

24/7 లైట్స్ ఆన్ సార్.!



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో వీధి దీపాలు 20 రోజులుగా వెలుగుతూనే ఉన్నాయని ఇప్పటికి ఎన్నో మార్లుగా ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఉప్పల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఫణిందర్ ఆరోపించారు. దాదాపుగా 200 స్తంభాలకు వీధి దీపాలు పట్టపగలు కూడా వెలుగుతున్నాయని తెలిపారు. ఇదే విషయంపై 15 రోజుల క్రితం ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సోమవారం స్థానిక నేతలతో కలిసి ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలోని ప్రజావాణిలో డీసీ రాజుకు ఫిర్యాదు చేశారు. వీధి దీపాలు నిత్యం వెలగటానికి ముఖ్య కారణం లైన్‌మెన్‌లు, అధికారుల నిర్లక్ష్యమేనని అన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించి విద్యుత్‌ను ఆదా చేయాలని కోరారు.

నిధులు మంజూరు చేయండి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. ఈ మేరకు సోమవారం జలమండలి ఆపరేషన్ విభాగం డైరెక్టర్ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చాణక్యపురి, వాజ్‌పేయినగర్ సెక్షన్‌లలో పనులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. సెక్షన్ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రధాన కార్యాలయానికి పంపించారని చెప్పినట్లు ఆయన తెలిపారు. చాలా ప్రాంతాల్లో డ్రైనేజీల్లో సిల్ట్ తీయడం లేదన్నారు. ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయాలని కోరారు.

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

కుషాయిగూడ: నియోజకవర్గం అభివృద్ధే తన ధ్యేయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. మీర్‌పేట్ – హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని కాలనీల్లో రూ.52 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనకు రాజకీయాలతో సంబంధం లేదని అభివృద్ధే తన అజెండాగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. దశలవారీగా నియోజకవర్గంలో వసతులకు కల్పిస్తానన్నారు. అనంతరం కాలనీల్లో పర్యటించి కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కాలనీల్లో సమస్యలను పరిశీలించి పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభివృద్ధితో పాటుగా ప్రజల సంక్షేమానికి తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, డిఈ రూప, స్థానిక నేతలు వంజరి ప్రవీణ్, బోదాసు రవి, మల్లేష్‌గౌడ్, మల్లారెడ్డి, ఇక్బాల్, కిరణ్, శేఖర్‌గౌడ్, శివ, దండెం నరేందర్, నిసార్ అహ్మద్ గోరీ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌బీకాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

పార్కు ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పార్కు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని వీటి రక్షణకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మచ్చబొల్లారం, అల్వాల్, వెంకటాపురం డివిజన్‌లకు చెందిన బీజేపీ నాయకులు ఉప కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి పలు అంశాలపై వినతిపత్రం అందచేశారు. కాలనీల్లో గల పార్కు స్థలాలు ఆక్రమణకు గురవుతుండడంతో పాటు నిర్మాణాలు సైతం జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటుచేయాలని కోరారు. మరమ్మతు పనులు చేపట్టాలన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అల్వాల్: నేరాల నివారణకు నేరేడ్‌మెట్ పోలీసులు వినూత్న చర్యలు చేపట్టారు. మొబైల్ కారు, బైక్‌లతో పాటు మహిళ పోలీసులు సైకిల్‌పై కాలనీల్లో తిరుగుతూ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. సోమవారం నేరేడ్‌మెట్‌లోని జేజేనగర్, డిఫెన్స్ కాలనీల్లో మహిళా పోలీసులు సైకిల్‌పై ఇంటింటికి తిరుగుతూ ఇటీవల నూతనంగా జరుగుతున్న సైబర్ నేరాల పట్ల మహిళలను అప్రమత్తం చేశారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి దృష్టి మళ్లించి నేరాలకు పాల్పడుతున్నారని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్ల అద్దెకు కావాలని ఇంటికి వచ్చి దాడి చేసి దొంగతనానికి పాల్పడుతున్న సంఘటనలు ఉదహరించారు. గుర్తు తెలియని వారు ఇంటి లోపలికి అనుమతించకుండా పోలీసులు వచ్చి చర్చిస్తుండడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పోలీసుల పట్ల స్నేహపూర్వక వాతావరణాన్ని కలుగజేస్తుందని అన్నారు.



నేరేడ్‌మెట్‌లోని కాలనీల్లో సైకిల్‌పై తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి



అల్వాల్ సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

అల్వాల్: విధి నిర్వహణలో అలసత్వం, అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సర్కిల్ కార్యాలయం ఎదుట వారు బైఠాయించి నిరసన తెలిపారు. అల్వాల్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అవినీతిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి నిర్మాణాలు లేకుండా ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అవకతవకలు జరుగుతున్నాయని తెలిసినా అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడ్డారు. అక్రమ నిర్మాణాలకు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. దీనిని గమనిస్తే అధికారులకే అక్రమ నిర్మాణాలకు అవకాశం కల్పిస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాణిక్యరెడ్డి, వెంకటేష్, మురళీకృష్ణ, సుజాత, మల్లికార్జున్‌గౌడ్, శ్రీనివాస్, పద్మిని, కార్తీక్‌గౌడ్, లక్ష్మణ్ తదతరులు పాల్గొన్నారు.

ఇక్రిశాట్‌కాలనీ సమస్యలను పరిష్కరిస్తాం

మల్కాజిగిరి: ఇక్రిశాట్ కాలనీలో సమస్యలు పరిష్కరిస్తామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ దెబ్బతిన్నాయని, విద్యుత్ దీపాలు వెలగడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డువస్తున్నాయని తెలిపారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని హార్టికల్చర్ సిబ్బందికి సూచించారు. త్వరలో అధికారులతో కలిసి పర్యటించి ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సత్యలక్ష్మి, వీఐ రజనీకాంత్, ఉమేష్‌సింగ్, కిషోర్, కాలనీవాసులు వెంకటరత్నం, అనురాధ, మైకేల్, కొండయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఇక్రిశాట్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

పంచ పరివర్తన ముఖ్యం



మల్కాజిగిరి: ఆర్ఎస్ఎస్‌లో పంచపరివర్తన ముఖ్యమని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముదిగొండ సుధాకర్ అన్నారు. మల్కాజిగిరి గాంధీపార్కులో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుధాకర్ మాట్లాడుతూ... కుటుంబ ప్రబోధన్, సామరస్యత, పర్యావరణం, స్వదేశీ, పౌర విధులను పాటించి సమాజంలో మార్పు తీసుకురావాలన్నారు. తెలంగాణ ప్రాంత సహకార్యవాహ మల్లికార్జున్ మాట్లాడుతూ... వంద సంవత్సరాలు సమాజ సేవలో ఉండడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాగరాజు, జూలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న వీధి కుక్కలు

వ్యక్తిపై దాడి ఆస్పత్రికి తరలింపు





గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌లో వీధి కుక్కలు విజృంభిస్తున్నాయి. రాకపోకలు సాగించే వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. గౌతంనగర్ డివిన్ పరిధిలోని మల్లికార్జుననగర్, హనుమాన్‌పేట, మిర్జాలగూడ, జ్యోతినగర్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ పలువురిపై దాడులకు పాల్పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సోమవారం సాయంత్రం మల్లికార్జునగర్‌కి చెందిన శ్రీధర్ (37) కూరగాయలు తీసుకురావడానికి స్థానికంగా ఉన్న దుకాణానికి వెళ్లి కూరగాయలు తీసుకొని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వీధి కుక్క దాడి చేయడంతో కాళ్లకు తీవ్రంగా గాయాలై పెద్ద ఎత్తున రక్తస్రావం జరిగింది. దీంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రైల్వే ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా వీధి కుక్కల నియంత్రణలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని పలువురు పెద్ద ఎత్తున విమర్శలు చేశారు.

వ్యక్తి అదృశ్యం

అల్వాల్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ అల్వాల్ అంబేడ్కర్‌నగర్‌కి చెందిన దామోదర్ (55) మానసిక స్థితి బాగాలేదు. ఈనెల 4వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దామోదర్ కుమారుడు బాలకృష్ణ తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యం.. పనుల్లో జాప్యం

- ఉప్పల్ కారిడార్ పనులు పూర్తి చేయాలని సీపీఎం నిరాహార దీక్ష
- 18 నెలల్లో పూర్తి చేయాల్సిన పనులు నేటికీ సాగుతున్న వైనం

ఉప్పల్: ఉప్పల్ నుంచి నారాపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతగాని తనం, నిర్లక్ష్యం కారణంగానే జాప్యం జరుగుతోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి తీవ్రంగా ఆరోపించారు. ఉప్పల్ టు నారాపల్లి వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ పనుల జాప్యాన్ని నిరసిస్తూ సీపీఐ(ఎం) మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద ఒక్క రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన రంగారెడ్డి మాట్లాడుతూ... ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేసారు. 18 నెలల్లో పూర్తి చేయాల్సిన కారిడార్ నిర్మాణ పనులు సంవత్సరాలు గడిచినా 50శాతం కూడా పూర్తి కాలేదని విమర్శించారు.రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులతో కలిసి 8 మంది బీజేపీ ఎంపీలు, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులుగా పని చేసిన ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంటి హేమాహేమీలు ఉన్నా కూడా పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వరకు జాతీయ రహదారి గుంతలమయంగా మారినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీనిపై రాష్ట్ర కమిటీ నుంచి ఆర్‌అండ్‌బీ మంత్రికి లేఖ రాయనున్నట్లు తెలిపారు.

ఎంపీ ఈటల చొరవ తీసుకోవాలి...

జిల్లా కార్యదర్శి సత్యం మాట్లాడతూ... కారిడార్ నిర్మాణ పనులు కదలడం లేదని మంత్రి చుట్టపుచూపుగా వచ్చి చూసిపోతున్నారే తప్ప పట్టించుకోవడం లేదని లేదని ఆరోపించారు. 2026 దసరా నాటికి పనులు పూర్తవుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ ఇచ్చినా అప్పటి వరకన్నా పూర్తవునా అని అనుమానం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రయాణం చేసే వారు నిత్యం నరకం అనుభవిస్తున్నా ఎందుకు పట్టటం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిని ఎంపీ ఈటల రాజేందర్ చొరవ తీసుకుని పనులు వేంగవంతంగా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వాలు ఇలానే మొండి వైఖరి ప్రదర్శిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షకు బీఆర్ఎస్ నేతలు మాజీ మేయర్ జక్కా వెంకటరెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, సత్యప్రసాద్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, చంద్రశేఖర్, వినోద, ఉప్పల్ మండల కార్యదర్శి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఎలివేటెడ్ కారిడార్ పనుల జాప్యంపై ఉప్పల్ చౌరస్తాలో నిరాహార దీక్షలో కూర్చున్న జూలకంటి రంగారెడ్డి